క్లుప్తంగా

ఐరన్ మాత్రల పంపిణీ



గడిముడిదాం పాఠశాలలో విద్యార్థుల నోట్లో ఐరన్ మాత్రలు వేస్తున్న సిబ్బంది

రాజాం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఐరన్ మాత్రలు శనివారం పంపిణీ చేశారు. విద్యార్థుల్లో రక్తహీనత నివారణలో భాగంగా వైద్యారోగ్య సిబ్బంది విద్యార్థులకు ఈ ఐఎఫ్ఏ(ఐరన్ ఫోలిక్ యాసిడ్) మాత్రలు వేసినట్లు ఎంఈవోలు ప్రవీణ్‌కుమార్, దుర్గారావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి



తాటిపాడులో రైతుల పేర్లు నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

రేగిడి: ఖరీఫ్ సాగు కోసం విత్తనాలు కావాల్సిన రైతులంతా పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని కందిశ, తాటిపాడు, లక్ష్మణవలస గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాల నిమిత్తం రైతుల పేర్లు నమోదు చేసే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌ల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు విత్తనాలు కావాలని వచ్చిన వారి పేర్లు నమోదు చేశారు. ప్రస్తుతం ఆర్బీకేల వద్ద పంపిణీ చేస్తున్న విత్తనాలు కూడా ముందుగా పేర్లు నమోదు చేసుకున్న రైతులకే ఇస్తున్నామని ఏవో తెలిపారు.

చెడువ్యసనాలకు దూరంగా ఉండండి



యువతకు సూచనలిస్తున్న ఎస్ఐ షేక్ శంకర్

సంతకవిటి: చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని యువతకు ఎస్ఐ షేక్ శంకర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల యువతతో శనివారం సమావేశమైన ఆయన.. మద్యం, గంజాయి, ఖైనీ, గుట్కా వంటి వాటికి అలవాటు పడొద్దని తెలిపారు. మంచి అలవాట్లు అలవర్చుకుని, ఉత్తమ పౌరులుగా జీవించాలన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

వంగర: మండల పరిధిలోని మడ్డువలస వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్న తరగతుల్లో మిగులు సీట్లు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ పి.పద్మావతి శనివారం తెలిపారు. సీటు కావాల్సిన వారు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 29వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు అభ్యర్థులకు పరీక్ష ఉంటుందన్నారు.

శ్రమదానం



కాలువలో పూడికలు తొలగిస్తున్న రైతులు

వంగర: మండల పరిధిలోని మగ్గూరు సాగునీటి కాలువలో రైతులు శనివారం శ్రమదానం చేపట్టారు. పాతచెరువును ఆనుకుని ఉన్న ఈ కాలువలో గత కొంతకాలంగా పిచ్చిమొక్కలు, పూడికలు పేరుకుపోయాయి. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ఊపందుకోవడంతో సాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా కాలువలోని పూడికలు, జంగిల్స్ తొలగించినట్లు తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

బొబ్బిలి: ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల్లోని టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులను ఆయా యాజమాన్యాలు నచ్చినపుడు తొలగిస్తున్నాయన్నారు. దీంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి ఉద్యోగ భద్రతతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ సదుపాయాలు కల్పించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ వర్కర్ల సంఘం నాయకుడు యుగంధర్ తదితరులు ఉన్నారు.

పార్టీ కార్యాలయం కూల్చివేత దుర్మార్గమైన చర్య

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయ నిర్మాణం కూల్చివేత దారుణమని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఖండించారు. స్థానిక పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో దౌర్జన్యకాండకు దిగిందని విమర్శించారు. అధికారమదంతో ఆ పార్టీ నేతలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల ఫలితాల దగ్గర నుంచి ఇప్పటి వరకు జరుగుతున్న దారుణాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై భౌతికదాడులకు పాల్పడడం, వారి ఇళ్లను ధ్వంసం చేయడం, ప్రభుత్వ భవనాలు, శిలాఫలకాలను నాశనం చేయడం దేశం మొత్తం చూస్తోందన్నారు. తెల్లవారుజామున తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయ నిర్మాణాన్ని బుల్డోజర్లతో పడగొట్టారని, ఆ నిర్మాణానికి సంబంధించి అన్ని అనుమతులు ఉన్నా అవేవీ లేనట్లు కూలదోయడం సరికాదన్నారు. గతంలో టీడీపీ కూడా ప్రభుత్వ స్థలాల్లో కార్యాలయాలు నిర్మించుకున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దాడులు చేయొద్దని పిలుపునిస్తూనే ముఖ్యమంత్రి చంద్రబాబు పరోక్షంగా తమ నాయకులను వైఎస్సార్ సీపీ నేతలపై రెచ్చగొడుతున్నారన్నారు. ఏదైనా భవనం కూల్చివేయాలంటే ముందస్తుగా నోటీసులు ఇచ్చి, వారం రోజులు సమయం ఇవ్వాలని, ఆ తర్వాత వారు ఇచ్చే సమాధానం సరిగా లేకపోతే అప్పుడు చర్యలు తీసుకోవాలన్న విషయం తెలీదా అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న టీడీపీ అరాచకాలపై కోర్టు సుమోటోగా వ్యవహరించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రుషికొండలో నిర్మించిన ప్రభుత్వ భవనాలపై కూడా టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఆ భవనాలు వ్యక్తిగత భవనాలుగా చిత్రీకరించి ఆ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లే దుర్మార్గమైన చర్యలకు ఒడిగట్టడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కక్ష సాధింపు చర్యలు మాని, ప్రజలకు మంచి చేయాలని హితవు పలికారు. ఎన్నికల హామీలు ఎప్పటి నుంచి నెరవేరుస్తున్నారో చెప్పకుండా ప్రజలను పక్కదోవ పట్టించేందుకు ఇలాంటి దుశ్చర్యలు చేయడాన్ని ఎవరూ హర్షించరన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. సమావేశంలో జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శంబంగి వేణుగోపాలనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, బాడంగి జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఏఎంసీ డైరెక్టర్ సాధిక్, చంద్రశేఖర్, భమిడిపాటి విశ్వనాథశర్మ, త్రినాధరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



చాటాయివలసలో నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ కిరణ్ కుమార్ తెలిపారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో సర్పంచ్ కరణం గోవిందరావుకు చెందిన ఐదెకరాల పొలంలో 30 రకాల నవధాన్యాలు శనివారం నాటించి, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ప్రతీ రైతు ప్రధాన పంట సాగుకు ముందు నవధాన్యాలు వేసుకుని, దుక్కి చేసుకోవాలని, తద్వారా భూసారం పెరిగి పంటలు బాగా పండుతాయన్నారు. అలాగే చీడపీడలు, తెగుళ్ల నుంచి కూడా ప్రధాన పంటకు రక్షణ కలుగుతుందన్నారు. ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగబడులు సాధ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పొగిరి అప్పలనాయుడు, ఐసీఆర్పీలు ఐ.తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణపై అవగాహన



బాలికల రక్షణకు కల్పిస్తున్న ప్రభుత్వ చర్యలను వివరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి

రామభద్రపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల సంరక్షణ చర్యలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కె.కామేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారిలు బాలికల చట్టాలు, సంరక్షణ చర్యలను వివరించారు. గృహ హింస, వరకట్న వేధింపుల నుంచి రక్షణ పొందేందుకు చేపట్టాల్సిన చర్యలను తెలిపారు. దిశ, రక్షా యాప్‌ల వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆకతాయిలు ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు పాల్పడినా రక్షణ కోసం 1091, 100 వంటి టోల్‌ఫ్రీ నంబర్లకు కాల్ చేయాలని తెలిపారు

సీబీఎం స్కూల్ కబ్జాకు యత్నం



మాట్లాడుతున్న డేవిడ్

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని సీబీఎం స్కూల్‌ను కబ్జా చేసి, ఆక్రమించుకునేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని, అధికారులు స్పందించి, స్కూల్‌ను కాపాడాలని సీబీఎం సంఘ సభ్యుడు సీహెచ్ డేవిడ్ కోరారు. ఇదే విషయమై శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన.. కొన్ని దశాబ్దాలుగా బాలికా విద్యకు ప్రాధాన్యమిస్తూ నడిచిన ఈ స్కూల్ రికగ్నిషన్ రెన్యువల్ కాకుండా అడ్డుకుంటున్నారని, స్కూల్ నిర్వహణకు అనుమతులు కూడా రద్దు చేయించి స్కూల్ స్థలాన్ని ఆక్రమించి, విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల ఎం.రత్నకుమార్ అనే కరస్పాండెంట్ ఇక్కడ నియమితులయ్యాక స్కూల్‌ను ఇతర ప్రాంతానికి బదిలీ చేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని, స్కూల్ ఆక్రమణకు గురికాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థి అభ్యసన స్థాయిని పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో త్రినాధరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన.. విద్యార్థుల హాజరు, మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల పరిసరాలు, పాఠశాల రికార్డులు, పీఎం పోషణ గోరుముద్ద పథకాన్ని, విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేయాలని, విద్యార్థుల అభ్యసన స్థాయిలను పెంచాలని తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చెత్తశుద్ధి నిర్వహణ కేంద్రం వద్ద పిచ్చిమొక్కలు తొలగిస్తున్న గ్రామస్తులు

తెర్లాం: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని, ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండలంలోని సింగిరెడ్డివలస సర్పంచ్ సింగిరెడ్డి తిరుపతిరావు సూచించారు. ఆ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి వెన్నెల హరి ఆధ్వర్యంలో పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చెత్తశుద్ధి నిర్వహణ కేంద్రం ఆవరణలో, రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందించాలన్నారు. వీధి కాలువల్లో చెత్తాచెదారాలు వేయవద్దని, ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

సహిత విద్యాబోధనను మరింత మెరుగుపరచాలి



నందిగాంలో హోమ్ బేస్డ్ విద్యార్థి ప్రకాష్ ఇంటికి వెళ్లి, ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: ప్రత్యేకావసరాలు గల పిల్లల(హోమ్ బేస్డ్ విద్యార్థులు)కు అందిస్తున్న సహిత విద్యను మరింత మెరుగుపరచాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాధరావు సూచించారు. ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు సూర్యారావుతో కలిసి ఆయన మండలంలోని నందిగాం గ్రామంలో తొమ్మిదో తరగతి చదువుతున్న హోమ్ బేస్డ్ విద్యార్థి ఆర్.ప్రకాష్ ఇంటికి శనివారం వెళ్లి, విద్యార్థి శారీరక, మానసిక, కౌశలాల అభివృద్ధిని పరిశీలించారు. ప్రకాష్ గతంలో కంటే శారీరకంగా ఆరోగ్యంగానే ఉన్నట్లు గుర్తించారు. బౌద్ధికంగా ఆలోచనా శక్తి కూడా పెరిగినట్లు తన పరిశీలనలో తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థి శారీరక, మానసిక ఆరోగ్య పరిస్థితిని గూర్చి తల్లిదండ్రులతో మాట్లాడి, తెలుసుకున్నారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని హోమ్ బేస్డ్ పిల్లల ఇంటికి వెళ్లి, వారి శారీరక, మానసిక స్థితిని తెలుసుకునేందుకు ప్రతీ శనివారం గృహ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సహిత విద్య విభాగం ద్వారా ప్రత్యేకావసరాలు గల పిల్లలకు అందిస్తున్న విద్య పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోండి

బొబ్బిలి రూరల్: అసంఘటిత కార్మికులు, వ్యవసాయ కూలీలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రమాద బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. ఇదే విషయమై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఏడాదికి కేవలం రూ.22 నామమాత్రపు రుసుంతో కేంద్రం ఈ బీమా సదుపాయాన్ని అందిస్తోందని, ప్రతీ కార్మికుడు ఈ సదుపాయం పొందాలన్నారు. ఏదైనా ప్రమాదం బారినపడి మరణించినా, క్షతగాత్రులైనా బీమా వర్తిస్తుందన్నారు. పూర్తి వివరాల కోసం తహసీల్దార్, ఎంపీడీవో, కార్మిక శాఖ కార్యాలయాలను సంప్రదించాలన్నారు.

నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాల విక్రయాలు

బొబ్బిలి: నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న సురేష్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏపీ విద్యార్థి జేఏసీ నాయకుడు సాయికిరణ్ డిమాండ్ చేశారు. ఆ స్కూల్ బుక్ స్టాక్ పాయింట్ వద్ద శనివారం ఆయన ఆందోళన చేపట్టారు. స్కూల్ పేరిట పాఠ్యపుస్తకాలు ప్రింట్ చేసి, విద్యార్థులకు విక్రయించడం జరుగుతోందని, దీనిపై విద్యాశాఖాధికారులకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. స్పందించిన ఎంఈవో చల్ల లక్ష్మణరావు ఆ స్కూల్‌కు సోమవారం వెళ్లి, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్డీవోకు సన్మానం



ఆర్డీవోను సన్మానిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, తదితరులు

బొబ్బిలి: స్థానిక పట్టణంలో శుక్రవారం నిర్వహించిన అభినందన సభలో ఆర్డీవో ఎ.సాయిశ్రీని అభినందించి, సత్కరించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల విధుల నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు గాను ఆమెను సన్మానించినట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ పి.శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ ప్రతినిధులు టీఎస్ఎస్ కార్తీక్, ఎన్నారై ఎండీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన

రేగిడి: మండలంలోని ఖండ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయుర్వేద వైద్యంపై శనివారం అవగాహన కల్పించారు. అన్నిరకాల వ్యాధుల నుంచి ఉపశమనం పొందేందుకు ఆయుర్వేద మందులు ఉన్నాయని, అవి మంచి ఫలితాలను ఇస్తాయని తెలిపారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుర్వేద మందులు వినియోగించుకోవాలని ఆయుర్వేద వైద్యాధికారి ఎస్.సునీల్‌కుమార్ తెలిపారు.

ఆధ్యాత్మిక దివ్య మహాసభ

రేగిడి: స్థానిక దత్తపీఠంలో ఆధ్యాత్మిక దివ్య మహాసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని సూచించారు. అందరూ సన్మార్గంలో పయనిస్తేనే మంచి సమాజం నిర్మితమవుతుందన్నారు. కార్యక్రమంలో పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ, సామంతుల దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తనిఖీలు

రేగిడి: మండలంలోని వండానపేట, అప్పాపురం, మజ్జిరాముడుపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం వైద్యశిబిరాలు చేపట్టి, ప్రజలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సోహినీ రాఘవ్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం మెరుగైన ఆరోగ్యానికి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300



సంతకవిటి: వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు



రాజాం: గార్రాజుచీపురుపల్లిలో సాగునీటి కాలువలో చేస్తున్న ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

సంతకవిటి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందని వేతనదారులకు ఏపీవో హరనాథరావు తెలిపారు. మండలంలోని చిత్తారపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న కారణంగా ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు పని చేయాలని సూచించారు. పని ప్రదేశంలో చలువ పందిరి వేసుకోవాలని, తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

రాజాం: ఉపాధి హామీ పనులను వేతనదారులు సక్రమంగా చేసుకోవాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని గార్రాజుచీపురుపల్లిలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి, వేతనదారుల మస్తర్లు సరిచూశారు. బినామీ మస్తర్లు వేస్తే నిజమైన వేతనదారులు నష్టపోతారని, తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. టెక్నికల్ అసిస్టెంట్‌లు ఇచ్చిన కొలత ప్రకారం పనులు చేస్తే రోజువారీ కనీస వేతనం రూ. 300 వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్లు అందించాలి



దోసరి పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న సర్పంచ్ సాయిరాం

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్లు అందించాలని ఎంఈవో యాగాటి దుర్గారావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని దోసరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన.. అక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతం పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం మెనూ గమనించి, మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడేలా విద్యాబోధన చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరగాలని, ఆ దిశగా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీతారాం తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ

తెర్లాం: ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లను సక్రమంగా వినియోగించుకోవాలని మండలంలోని అరసబలగ సర్పంచ్ కొరగంజి సాయిరాం విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదువుకోవాలని, ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు



పోతులజగ్గుపేట-లాభాం వంతెన దగ్గర నదీతీరాన్ని పరిశీలిస్తున్న జిల్లా గనుల శాఖ డీడీ సూర్యచంద్ర

సంతకవిటి: అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా గనుల శాఖ డీడీ సీహెచ్ సూర్యచంద్ర హెచ్చరించారు. మండలంలోని తమరాం వద్ద ఉన్న పాత ఇసుకరీచ్‌తో పాటు పోతులజగ్గుపేట, మేడమర్తి తదితర గ్రామాల్లోని నదీ తీరాలను ఆయన శనివారం పరిశీలించారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సిబ్బంది, తహసీల్దార్ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



బొబ్బిలి రూరల్: విద్యార్థులతో ఉపాధ్యాయుడు వెంకటప్పలనాయుడు



రాజాం సిటీ: మాధవబజార్ పాఠశాల విద్యార్థులతో వాసవీక్లబ్ సభ్యులు

బొబ్బిలి రూరల్: మండలంలోని మోసూరువలస ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయుడు పాలూరు వెంకటప్పలనాయుడు విద్యాసామగ్రి శనివారం వితరణ చేశారు. నిరుపేదలైన 37 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు తదితర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: స్థానిక మాధవబజార్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులను వాసవీక్లబ్ మనరాజాం-సారధి సభ్యులు శనివారం అందించారు. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అధికారి కుసుమంచి పాపారావు ఆధ్వర్యంలో డాన్ టు డెస్క్ కార్యక్రమాలు నిర్వహించామని గ్రంధి రవికుమార్ తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు పేదలకు అన్నదానం చేశామన్నారు. అలాగే మాధవబజార్‌లో వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంకు ద్వారా తాగునీటి సదుపాయం కల్పించామన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ ఆర్‌సీ మన్మథరాజా, ఉప్పల అంబరీష, పేర్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: వేణుగోపాలపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం(బాలికలు) పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.ఉషారాణి శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 25 లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఏ గురుకుల పాఠశాలలో చేరాలని కోరుకుంటున్నారో వారికి అదే పాఠశాలలో ఈనెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షకు విద్యార్థి ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీతో హాజరు కావాలని సూచించారు. ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ, రిజర్వేషన్ కేటగిరీ ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి ఉపాధి సోషల్ ఆడిట్

డెంకాడ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి ఆదివారం నుంచి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లవరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి ఆడిట్ అధికారులు, సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు రూ.20 కోట్లు ఉపాధి నిధులతో వివిధ పనులు చేపట్టామన్నారు. నిధుల ఖర్చుకు సంబంధించి ఆడిట్‌ను పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో చేపట్టిన పనులు, బిల్లు చెల్లింపులు, రికార్డులు క్షుణ్ణంగా తనిఖీ చేసి నివేదిక అందజేయాలన్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరేష్

విజయనగరం క్రైమ్: మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు, యువతకు వివరించడంతో పాటు వారిని మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా చేసేందుకు చర్యలు చేపట్టామని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. పట్టణంలోని మహారాజా, ఆదిత్య డిగ్రీ కళాశాలల విద్యార్థులతో శనివారం మమేకమయ్యారు. గంజాయి, డ్రగ్స్, హెరాయిన్, గుట్కా, ఖైనీ, తదితర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తుకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని కోరారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు ప్రణాళికతో కృషిచేయాలని సూచించారు. ఎక్కడ ఎటువంటి మాదక ద్రవ్యాల సరఫరా జరుగుతున్నా వెంటనే తమకు తెలియజేయాలని కోరారు. అనంతరం మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు.